# వైద్యరంగంలో నర్సుల పాత్ర మరువలేనిది

## ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం



అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నర్సులు

బడంగ్‌పేట్, మే 12: మహేశ్వరం మండల పరిధిలోని భగవతీపూర్‌లో ఉన్న ఆవేర్ హాస్పిటల్లో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేయించి మిఠాయిలను పంచిపెట్టారు. నర్సింగ్ విభాగంలో ఉత్తమ సేవలందించిన వారికి నర్సింగ్ కళాశాల డైరెక్టర్ వెంకన్న, గణేష్ పురస్కారాలు అందజేశారు. ఆ వేర్ డీజీ రాజ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలలో వెయ్యి మంది నర్సింగ్ సైన్యానికి సేవ చేయడానికి ముందుకు వచ్చారని ఆయన గుర్తు చేశారు. వైద్యరంగంలో నర్సుల పాత్ర మరువలేనిదన్నారు. భగవత్పూర్ లో పారామెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నర్సింగ్‌తో పాటు, డయాలసిస్, పారా మెడికల్ కోర్సు కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. దేశంలో ఆవేర్ నర్సింగ్, అపోలో నర్సింగ్‌కు మంచి పేరు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఇర్షద్, రవికాంత్, వెంకట్ రెడ్డి, నాగేశ్వరరావు, దీన అభిలాష్, తదితరులు ఉన్నారు.

# భారత యుద్ధ వీరులకు శక్తిని ఇవ్వాలని పూజలు



సైదాబాద్ రామాలయంలో అధికారుల ఫొటోలను ప్రదర్శిస్తున్న సీనియర్ సిటిజన్స్

సైదాబాద్,మే 12: దేశంలోని పౌర, సైనిక స్థావరాలపై దాడి చేయడానికి పాకిస్తాన్ ఉగ్రవాదులు ప్రారంభించిన దాడులను సమర్థవంతంగా తిప్పి కొట్టేందుకు భారత సాయుధ దళాలకు శక్తిని ఇవ్వాలంటూ సైదాబాద్ రామాలయంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీనివాస చారి, శ్రీనాథ చారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ సూర్యనారాయణరావు, వనం జగదీశ్వరరావు, నేరెళ్ల రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, దేశ ప్రజలకు ధైర్యం, నిబద్ధత ఇవ్వాలని, భారతీయ సాయుధ దళాలకు ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని ఏరివేతకు శక్తిని ఇవ్వాలని కోరారు. పహల్గాంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ప్రజలపై దైవానుగ్రహం ఉండాలి

## సబితా ఇంద్రారెడ్డి



బీరప్ప దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, తదితరులు

కందుకూరు, మే 12 : రాష్ట్ర ప్రజలపై దైవానుగ్రహం ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొలనుగూడలో జరుగుతున్న బీరప్ప జాతరలో ఆమె పాల్గొన్నారు. ఆమెకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె బీరప్ప దేవాలయంలో బీరప్ప కామరాతి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భగవంతుని కృప అందరిపై ఉండాలని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పేర్కొన్నారు. బీరప్ప జాతరను అందరూ సమష్టిగా ఉంటూ నిర్వహించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కొలనుగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు క్యామ మల్లేష్, మాజీ సర్పంచులు గీతేశ్వరీ గణేష్, మస్కు బాబు, గంగాపురం గోపాల్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్ , లక్ష్మీ నరసింహారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సూరుసాని రాజశేఖర్ రెడ్డి, ఆనంద్, మేఘనాథ్ రెడ్డి, దీక్షిత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొన్న అంజయ్య, మస్కు మహేష్, భక్తులు పాల్గొన్నారు.

# డాక్టర్ వసంతరాయులుకు 'గద్దర్ ఐకాన్' అవార్డు



గద్దర్ ఐకాన్ అవార్డును అందుకుంటున్న సామాజిక కార్యకర్త డాక్టర్ వీరభోగ వసంతరాయులు

మన్సూరాబాద్, మే 12: పేద ప్రజల సంక్షేమం కోసం కాలనీలు, బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న ఎల్బీనగర్‌కు చెందిన డాక్టర్ వీరభోగ వసంతరాయులుకు 'గద్దర్ ఐకాన్' అవార్డు 2025 లభించింది. సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల బీఎం బిర్లా సైన్స్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ విప్ పి. మహేందర్ రెడ్డి చేతులమీదుగా డాక్టర్ వీరభోగ వసంతరాయులు 'గద్దర్ ఐకాన్ అవార్డు 2025' ను అందుకున్నారు. ఈ సందర్భంగా వసంతరాయులు మాట్లాడుతూ, గద్దర్ ఐకాన్ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, పేద ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్. వేణుగోపాలా చారి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గద్దర్ కుమార్తె వెన్నెల పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

**మేడ్చల్, మే 12:** ఈనెల 20న జరిగే దేశవ్యాప్త నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సోమవారం సీఐటీయూ మేడ్చల్ మండల కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తుందన్నారు. మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని విమర్శించారు. 100 సంవత్సరాలలో సాధించుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోట్లను ముందు కు తెచ్చిందన్నారు. రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 60 వేల మంది ఉద్యోగులు, కార్మికులకు పని భద్రత లేదని, పర్మినెంట్ చేయడం లేదని, కనీస వేతనాలు, పీఎఫ్, ఇ.ఎస్.ఐ, ప్రమాదబీమా లాంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. హక్కులు, డిమాండ్ల సాధనకు రాష్ట్ర కార్మికవర్గం ఈనెల 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నర్సింగ్ రావు, వసంత, మల్లేష్, కొమురయ్య, పూజ, నర్సింగ్ రావు, ప్రశాంత్, రమేష్ పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి:ఎమ్మెల్యే

**మల్కాజిగిరి,మే12:** యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బొల్లారంలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ఫ్రెండ్స్ క్లబ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన టీంకు సోమవారం ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి ,వినయ్, జాన్ ,ప్రభాకర్ పాల్గొన్నారు.

# సీఎంఆర్‌లో ఎంఆర్ఐ సేవలు ప్రారంభం

**మేడ్చల్, మే 12:** సీఎంఆర్ దవాఖానలో ప్రారంభించిన ఎంఆర్ఐని వినియోగించుకోవాలని సీఎంఆర్ చైర్మన్ చామకూర గోపాల్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ వైద్య కళాశాల దవాఖానలో సోమవారం ఎంఆర్ఐ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో ఉండగా ఎంఆర్ఐ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం



నాగలక్ష్మి, ప్రిన్సిపాల్

మలక్‌పేట, మే 12: మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ కే. నాగలక్ష్మి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చునని, పాఠశాలలో అడ్మిషన్లు పొందగోరే విద్యార్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, మూడు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని ఆమె సూచించారు. పాఠశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి, యూనిఫామ్ లు, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వబడతాయని ఆమె తెలిపారు. ప్రతి విద్యార్థికి కాస్మెటిక్స్ చార్జీల కింద నెలకు రూ. 250 ఇవ్వబడతాయని ఆమె తెలిపారు . పాఠశాల పని దినాల్లో (సెలవు రోజుల్లో కాకుండా) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అడ్మిషన్లు తీసుకోబడతాయని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 76749 33347, 9000 221 301 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

## 2025లో నూరు శాతం ఉత్తీర్ణత

2024– 2025 విద్యాసంవత్సరానికి గాను ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలలోని 23 మంది విద్యార్థులకు గాను 15 మంది ఫస్ట్ క్లాస్‌లో, 8 మంది విద్యార్థులు సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యారని ఆమె తెలిపారు. జిల్లాలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత ను సాధించిన మొదటి పాఠశాలగా గుర్తింపు లభించిందని ఆమె పేర్కొన్నారు.

# సేవే లక్ష్యంగా.. ఎస్ఆర్ఆర్ ట్రస్ట్



రాగి జావ పంపిణీ చేస్తున్న రామచంద్రరావు

ఆర్కే పురం, మే 12: సేవే లక్ష్యంగా ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందని ఆ ట్రస్ట్ చైర్మన్ యస్. రామచంద్రరావు అన్నారు. సోమవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగి జావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రలేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఇంద్ర సేనారెడ్డి, పేరాల శేఖర్ రావు, మురళీమనోహర్, కాలనీవాసులు, వాకర్స్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలవాలి: ఏసీపీ



యూ రూల్ ఆన్లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

ఆర్కేపురం, మే 11: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంతంగా తమ కాళ్ల మీద నిలబడి నలుగురికి ఉపాధి కల్పించడం గొప్ప విషయమని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. సోమవారం సరూర్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో 'యూ రూల్' (ఒక పరిష్కారం) సంస్థ యొక్క మొట్ట మొదటి ఆన్ లైన్ సెంటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ అన్ని రకాల ఆన్ లైన్ సేవలు, భూమి సంబంధిత అప్లికేషన్లు,లీగల్, ఆధార్, పాన్, పాస్ పోర్టు వంటి సేవలు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. నమ్మకం, ఖచ్చితత్వానికి నిదర్శనమే యూ రూల్ సెంటర్ అన్నారు. ప్రజలకు అత్యున్నత సేవలు అందించాలని, ఇతర నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోవర్ధన్, దుర్గా ప్రసాద్, మహేందర్, రాణి, నరేష్, సురేష్, బాబు, కేశవరావు, గీత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతరను జయప్రదం చేయాలి



వనస్థలిపురం, మే 12 : సాహెబ్ నగర్‌లోని ప్రసిద్ధ త్రినేత్ర ఆంజనేయ స్వామి వారి జాతరను జయప్రదం చేయాలని సాహెబ్ నగర్ గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. జాతర మహోత్సవాలు ఈనెల 14 నుంచి 16 వరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం గ్రామ పెద్దల సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. గత సంవత్సరం నిర్వహించిన విధంగానే ఈ సంవత్సరం కూడా జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు, భక్తులు, ఎల్బీనగర్, జంట నగరాల ప్రజలు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# నేడు కీసరలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**కీసర, మే 12:** కీసరలోని రైతు వేదికలో ఈనెల 13న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయాధికారి మాధవిలత తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలకు కీసరలోని రైతు వేదికకు రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు విచ్చేస్తున్నారని అన్నారు. పంటలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందుకు కీసరలోని రైతులందరు సకాలంలో తరలిరావాలని కోరారు.

## పంట మార్పిడితోనే అధిక దిగుబడి

**పోచారం,మే12:** రైతులు తరుచూ పంటల మార్పిడి చేస్తేనే ఆశించిన దిగుబడులు పొందుతారని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడురాములు నాయక్ అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీలో నిర్వహించిన రైతుల వద్దకు శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. రైతులు భూసార పరీక్షలు చేయించి తమ భూమిలో ఏ పంటలు అనుకూలమో గుర్తించి ఆ పంటలను సాగుచేసి లాభాలు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ ఏ ఎన్.వెంకట్రాంరెడ్డి,ప్రొఫెసర్లు డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, డాక్టర్ జె.సురేష్,ఏవో ఎంఏ భాసిత్,ఏఎస్ఓ లు మంజుల, జె.జగదీశ్వర్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, రైతు సహకార సంఘం ఉపాధ్యక్షుడు అనంత రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**మేడ్చల్ కలెక్టరేట్, మే 12 :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ ప్రజావాణిలో భాగంగా అర్జీలను స్వీకరించారు. 60 మంది వివిధ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

**కాప్రా:** కాప్రాసర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు అందాయి. మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ఫస్ట్‌ఫేజ్‌లో ప్రతి శనివారం వారం జరిగే వారాంతపు సంత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాల ని కోరుతూ ఆనంద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శివరాంప్రసాద్, గోవిందరెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కుషాయిగూడ వీ.ఎన్.రెడ్డినగర్‌లో అనుమతిలేకుండా నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక వెల్ఫేర్‌అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కాప్రా డివిజన్ ప్రథమపురి కాలనీలో ప్లాట్ నంబర్ 45లో అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న కార్ మెకానిక్ షెడ్ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి తగువిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కాప్రా సర్కిల్ డిప్యూటీకమిషనర్ జగన్ ఆదేశించారు.

# నేడు దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాప సభ

**కాప్రా, మే 12:** ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత బండారి రాజిరెడ్డి సంతాప సభను నిర్వహించనున్నారు. కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30లకు నిర్వహించే సంతాపసభకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

అందరూ ఈ సంతాపసభకు విచ్చేసి దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి నివాళుర్పించే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

# నాచారంలో 'భవన కార్మిక జేఏసీ' ఏర్పాటు




నూతనంగా ఏర్పాటైన జేఏసీ ప్రతినిధి కమిటీ

**ఉప్పల్, మే 12:** నాచారంలోని బీఎస్‌పీ కార్యాలయంలో సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నల్లా రాధా కృష్ణ హాజరై మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించారు. పథకాలు పొందాలంటే ప్రతిఒక్కరు లేబర్ గుర్తింపు కార్డును పొందాలని సూచించారు. ఈ సందర్భంగా భవన కార్మిక జేఏసీ కార్తికేయ నగర్, ఎర్రకుంట అడ్డ కమిటీని ప్రకటించారు. కన్వీనర్ గా బొడ్డు శివ అరుణకాంత్, ప్రెసిడెంట్ గా మద్దికుంట్ల వెంకన్న, జనరల్ సెక్రటరీగా తేజావత్ వీరన్న, వైస్ ప్రెసిడెంట్‌గా దావుల సైదులు, జాయింట్ సెక్రటరీ గా అవుదొడ్డి అంజయ్య ఎన్నికైనారు. ఈ మేరకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లా రాధా కృష్ణ, కనకమేడల రాంబాబు, కరాటే శ్రీరామ్, టి రాజబాబు, కనుకుంట్ల విజయ్, మల్కారీ అశోక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హుల ఎంపికను వేగవంతం చేయాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాంబశివరావు

**మేడ్చల్, మే 12:** రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన వేగిరపర్చి, అర్హులను ఎంపిక చేయాలని రాజీవ్ యువ వికాస కమిటీ కన్వీనర్, డీఆర్డీవో సాంబశివరావు అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన అర్హుల జాబితాను సంబంధిత శాఖల అధికారుల లాగిన్‌లోకి పంపాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో రాజీవ్ యువ వికాస పథకం అమలుపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రోజువారీగా దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు దరఖాస్తుదారులకు సిబిల్ వెరిఫికేషన్ అవసరం లేనందున ముందుగా వాటిని పరిశీలించి, బ్యాంక్‌ల ద్వారా ఎంపిక జాబితాను తెప్పించుకొని, కార్పొరేషన్ లాగిన్‌లోకి పంపాలన్నారు.దరఖాస్తుదారుల ఎం పిక విషయంలో సంబంధిత అధికారుల మానిటరింగ్ తప్పనిసరి అని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం వెంకటేశ్వర రావు, ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి వినోద్ కు మార్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీ లక్ష్మి, జిల్లా ఉపాధిశాఖాధికారి రాధిక, మత్స్య శాఖ శాఖాధికారి, తదితరులు పాల్గొన్నారు.


# 'సిందూర్'లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళి




అమర జవాన్లకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్ పేట్, మే 12 :మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ గ్రీన్ రిచ్ కాలనీ నుండి బడంగ్ పేట్ చౌరస్తా వరకు ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జరిగిన భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన కాల్పుల్లో వీర మరణం పొందిన అనంతపూర్ జిల్లాకు చెందిన వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. క్యాండిల్ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# దశలవారీగా అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం: కార్పొరేటర్



ఈస్ట్ ప్రశాంత్ నగర్ లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి

మలక్‌పేట, మే 12: మూసారాంబాగ్ డివిజన్లో సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈస్ట్ ప్రశాంత్ నగర్‌లో జీహెచ్ఎంసీ నిధులు రూ.13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీసీ రోడ్లు ఎక్కువకాలం మన్నికనిస్తాయని, వర్షాలు కురిసినా పాడవవని ఆమె తెలిపారు. డివిజన్లో అనేక కాలనీల్లో ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని ఆమె తెలిపారు. దశలవారీగా డివిజన్‌లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. వర్షాలు కురిస్తే బీటీ రోడ్లు నీటి తేమకు పాడవుతాయని, సీసీ రోడ్లు ఎక్కువ కాలం మన్నిక వస్తాయని, రోడ్లపై నీరు నిలిచినా పాడవవని ఆమె వివరించారు. వర్షాలు ప్రారంభం కాకముందే రోడ్ల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులను ప్రారంభించడం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. నూతన బడ్జెట్‌లో నిధులు కేటాయించినందున గడ్డిన్నారం బస్తీ, వెంకటేశ్వర స్వామి టెంపుల్ రోడ్డు, మోక్ష టిఫిన్ సెంటర్ వద్ద కూడా రోడ్ల నిర్మాణానికి నిధులు శాంక్షన్ అయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్ స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు అంజయ్య, దాసు, దుర్గాప్రసాద్, సంతోష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.